



కురూపికి అందకత్తె అయిన భార్య దొరికితే, ధ్యానం అంతా భార్యమీదేవుంటుంది. తన్ని సమంగా ప్రేమించి గౌరవిస్తుందో, లేదో అంటూ అందకత్తె అయిన భార్యపై అనుమానం వుండడం కురూపులకి సాధారణం! గోపాలానికీ భార్య సరోజమీద అనుమానంవుంటే అతని తప్పుకాదు! ఆమె అందాల భరిణ కావడం, అందవికారుల్లో తాను మొదటి వాడవడమూ దానికి కారణాలు!

సరోజలాంటి అందకత్తె యితడిని ఎందుకు పెళ్లి చేసుకోవాలీ? అని ధర్మ సందేహం కలగవచ్చు. గర్భదరిద్రుడయిన ఆమె తండ్రి కాళ్ళదగ్గిరకివచ్చిన యీ సంబంధాన్నికూడా తన్నుకుంటే — ఆర్థిక మాంద్యం రీతిగా వరమాంద్యం యేర్పడిన యీ రోజుల్లో సరోజకి కన్నెచెర తొలగడంకష్టమే! లైఫ్ ఇన్సూరెన్సు ఏజన్సీ తీసుకున్నా గోపాలం పదిరాళ్లు సంపాదిస్తున్నాడనీ, కూడూ, గుడ్డా యిచ్చి పెళ్ళాన్ని పోషించుకోగలడనీ తోచబట్టే సరోజ తండ్రి యీ సంబంధానికి ఒప్పుకున్నాడు. ఇక సరోజ ఒప్పుకోక ఏం జేస్తుంది?

సాంప్రదాయికమైన కుటుంబంలో పుట్టబట్టీ, కాస్త చదువుకున్నది కాబట్టీ సరోజ అన్నివిధాలా అనుకూలంగానే భర్తతోపాటు సంసారరథాన్ని యీడుస్తూ కాలం గడుపుతున్నాది. తనకి తగిన భర్త లభించలేదని ఆమె ఎంత మాత్రమూ కించ పడలేదు; ఎంతపూజచేస్తే అంతే వరం అంటూ ఆమె సిద్ధాంతం.

సంసారంలోని భాగస్వాములకి పరస్పరమూ అసంతృప్తి లేకపోయినా లోకంవూరుకోదు. లేని పోని విమర్శనలకి దిగి భార్యాభర్తల మధ్య పెను ప్రళయాన్ని లేవదీయడం లోకం స్వభావం! ఎవరు ఏమి చెప్పారోగాని, సరోజకి క్రమంగా తనమీద గౌరవం, అభిమానం తగ్గవచ్చని గోపాలానికి అనుమానం తట్టింది. అయితే మాత్రం ఏం చెయ్యగలడు? ఒక ఆరంగుళాలు ఎదగగలడా? శరీరం రంగు మార్చుకోగలడా? లేని కళాకాంతు లని తెచ్చి పెట్టుకోగలడా? అవేవీ సాధ్యం కావు. ఇక — నా మీద అభిమానంగా వుండాలని సరోజని బతిమాలుతాడా? అది అసలేకుదురదు. ఏమంటే—ఆమెకి తనమీద అభిమానం లేకపోతేగదూ! ఇక— ఏదోవిధంగా తన సామర్థ్యాన్ని ప్రదర్శించి, ఆమెకి ఆశ్చర్యం కలిగించి ఆమెప్రేమని అధికంగా చూరగొందా మని అతని కోరిక! ఆలోచించి, ఆలోచించి అత నొక నిశ్చయానికి వచ్చాడు.

సంగీతమో, కవిత్వమో, చిత్రకళో నేర్చుకుని, తన ప్రావీణ్యం వాట్లో చూపించి ఆమెకు ఎక్కువ అనురాగం కలిగించడానికి ప్రయత్నిస్తే బాగుం టుందని అతను తొలుత అనుకున్నాడు. అయితే- యీ లలితకళలన్నీ నేర్చుకుంటే వచ్చేవి కావంటూ తెలిసేక ఆ ఆశ వదులుకున్నాడు. ఏదో ఒక అద్భుతకృత్యం నెరవేర్చితీరాలని—సాయంత్రం గోదావరిగట్టుకు షికారు వెళుతూ ఆలోచించు కుంటూ వుండగా ఒక మంచి ఆలోచన తట్టింది. తానొక స్టీములాంచిని ఎక్కి డ్రయివరు దగ్గరే కూర్చుండి, దాన్ని నడిపేపద్ధతి గ్రహించాడు. ఇలా అయిదారురోజులు చూసి, అతన్ని బతిమాలు కుని రెండురోజులు తానే స్వయంగా నడిపాడు.

ఇక నేముంది ? తనకి గొప్ప కళ కైవసం అయిందన్నమాట !

ఒకనాడు సాయంత్రం గోపాలం యింటికి వేగంగావస్తూ 'సరోజా ! ఆలస్యంచెయ్యక వేగం ముస్తాబుచేసుకో ! మనం యివాళ గోదావరికి షికారువెళ్దాము' అని భార్యని తొందరపెట్టేడు.

'అదేమిటండీ ! సంసారులకి షికార్లేమిటండీ ! చూస్తే నలుగురూ నవ్వరూ ? నేనురాను, బాబూ! నాకు-సిగ్గువేస్తుంది' అంది ఆమె.

'నువ్వు అలా అనకూడదు. ఎప్పుడూ ఈ గూఢ్యంలో- వంటింట్లో కూచుంటే ఆరోగ్యం చెడుతుంది. కాస్త చల్లగాలి తగలాలి. ఇంతకీ-పురుషులతోపాటు స్త్రీలకి సమానహక్కులు కావలసిన యీ యిరవయ్యో శతాబ్దంలో కూడా, నీలాంటిదానికి జంకేమిటి ?'

'అదేమోనండి. నాకు చాలా సిగ్గేస్తుంది. ఇంతకీ యింతఅవ్యవధిగా చెబితే ఎట్లా? ముస్తాబు చేసుకోడానికి ఒకగంటన్నా పట్టదూ ?'

'అయితే సరి! ఇవాళ కాకపోతే-రేపు; రేపు సరిగ్గా నాలుగ్గంటలకే నువ్వు రెడీగా వుండాలి. ఒక స్టీంలాంచినికూడా మాట్లాడుతాను మన కోసం. దానిమీద గంటసేపు బోటు షికారు చెయ్యవచ్చు.'

'అదేమో బాబూ! అలాంటివి మనకు వద్దు. నాకు భయం వేస్తుంది. ఒకసారి గట్టుదాకా వెళ్ళి' తిరిగి వెనక్కి వద్దాము.'

'నేనుండగా నీకెందుకూ, భయం.'

'అయితే మీ యిష్టం! మీ మాటని కాదనడానికి నాకు యిష్టమూ లేదు; అధికారమూ లేదు.'

* * *

మర్నాడు సాయంత్రం నాలుగున్నరకల్లా ఆ దంపతులిద్దరూ గోదావరి ఒడ్డుకి వచ్చి స్టీం లాంచిలో అడుగుపెట్టారు.

'మనం యెక్కడ కూచోడం ?' అని సరోజ అడిగింది.

'నీ యిష్టంవచ్చినచోట కూచో; ఇది మన యిద్దరికోసమే మాట్లాడినది. ఇందులో మరెవ్వరూ ఎక్కరు' అని గోపాలం అన్నాడు కొంత గర్వంతో.

'సంతోషమే! కాని ఒకగంట కాలక్షేపానికి, దీన్ని అద్దెకు యెందుకు తీసుకోవాలి? మరెవరన్నా ఎక్కితే మనకి ఛార్జీ తక్కువ అవుతుంది గదా ?' అంది సరోజ.

'సరోజా! నేను అంత ఆలోచించకుండా యీ పని చెయ్యలేదు. లాంచిని రెండుగంటలకి అద్దెకు తీసుకున్నాను; నాకు దీన్ని నడపడం బాగా తెలుసు. అంచేత డ్రయివరుకు యివ్వవలసిన డబ్బు మనకు మిగిలింది.' అంటూ గోపాలం సగర్వంగా బుజాలెగరవేసి, కోటుజేబులో కాగితాలు భద్రంగా వున్నాయో లేదో చూసుకుని, కోటు సవరించుకుంటూ స్టీరింగు వీలుదగ్గరికి వెళ్ళి, దాన్ని విలాసంగా పట్టుకుని రథచోదనం ప్రారంభించాడు. లాంచి డబడబ శబ్దంతో బయలుదేరింది. అయిదు నిమిషాల్లో దాని వేగం అధికమయింది. గోపాలం మహోల్లాసంతో ధవళేశ్వరం వంపు నడుపుతూ, తమకి ఎదురుగానూ, ముందుగానూ నడుస్తున్న చిన్నచిన్న పడవలని బెదరగొట్టి పక్కలకి తప్పుకునేటట్లుచేసి, పకపక నవ్వుతూ, తన సామర్థ్యాన్ని సరోజ మెచ్చుకుంటున్నాదో, లేదో పరికిస్తూ మురిసిపోయాడు.

కొంతదూరం వెళ్లే సరికి మరో లాంచి, దీనికి ఎదురుగా రావడంచూసి, గోపాలం కొంచెంకంగారు పడ్డాడు. ఆ కంగారుతో ఆ లాంచి దీన్ని రాసుకు పోయింది. నీట్లు కొన్ని వీళ్ళ లాంచిలోకి తుళ్ళి సరోజ చీరని తడిపివేశాయి. ఎలాగో వీళ్ళ లాంచి తప్పించుకున్నది.

రెండు మైళ్ళదూరం ప్రయాణం సాగించాక ఎదురుగాలి విపరీతమైనది. ఆకాశంమీద మబ్బు లేని చిన్న చినుకులు పడడం ప్రారంభమయాయి. ఏదో ఒడ్డుకు చేరుకుంటేనే మేలని గోపాలం కంగారుతో లాంచిని నడపడం చూచి 'కంగారు పడకండి ; నిదానంగానే పోనీయండి ' అని సరోజ ధైర్యంచెప్పింది. లాంచి ఒడ్డువైపు వెళుతున్నాది. ముప్ఫయి గజాల దూరంవుంటుంది ఒడ్డు. కాని, యింతలో స్టీరింగు చక్రం పనిచెయ్యడం మానేసింది. గోపాలం తెల్లమొగంవేసి సరోజ వేపు చూశాడు. లాంచికి చిల్లుపడి, నీరులోపలికి రాసాగింది. అతను నిలువునా నీరయిపోయాడు.

'ఆలస్యం చెయ్యక, యిక ఎలాగన్నా యిందు లోంచి బయటపడడానికి యత్నించాలి' అంది ఆమె.

'ఏం లాంచి సంగతి?'

'గోదావరికే విడవాలి. లేకపోతే మనం గోదావరికి బలి కావలసినదే!'

గోపాలం ఆలోచనలో పడ్డాడు.

'ఇంకా ఆలోచనయేమిటి? కోటువిప్పి గిరాటెట్టండి, పంచె బిగించి కట్టండి. నీట్లోకి ఉరికి యీదండి; నేను చిన్నప్పుడు కొంత యీత నేర్చుకున్నా. కాలవలో మీ వెనకాతలే వస్తాను.'

'కోటుజేబులో నెల్లాళ్ళ కష్టార్జితమూ వున్నదే! ఎలా పారెయ్యను? నాకు యీదడం చేతకాదు గదా! గట్టిచిక్కే వచ్చిందే! నే నిక్కడే వుండిపోతా, నువ్వు వొడ్డుకి వెళ్లు.'


సరోజకి చాలా చికాకూ, అసహ్యమూ అనిపించింది. 'ఆ మాత్రం యీదడంకూడా రానివాళ్లు లాంచిని నడపడానికి ఎందుకు సిద్ధపడాలి? మారు మాట చెప్పక, కోటు విప్పివేసి, నా చెయ్యి పట్టుకోండి. నేనే మిమ్మల్ని వొడ్డుకు చేరుస్తాను.'

గోపాలం విధిలేక ఆమె చెప్పినట్లు చేశాడు. ఆమె చెప్పినట్లు చేత్తో నీటిని వెనక్కి నెట్టుతూ, ఆమెని అనుసరించాడు. ఆమె పెద్దపెద్ద బారలు వేస్తూ అయిదునిమిషాల్లో, భర్తతోకూడా వొడ్డు చేరింది. ఇద్దరూ బ్రతుకుజీవుడా! అనుకున్నారు.

అది జనశూన్య ప్రదేశం! అయినా జాకెట్టుతోటీ, అండర్ వేరుతోటీ ఒడ్డు ఎక్కడానికి సరోజ సిగ్గుపడింది! 'మీ మొలకి బిగించిన అంగవస్త్రం విడిచి నాకు యివ్వండి. ఒడ్డుకు రావడానికి వొళ్ళు చచ్చిపోతున్నాది' అంటూ నీట్లో కూచునే అడిగింది ఆమె.

గోపాలం విడిచి యిచ్చిన పై మీది వస్త్రం ఒంటికి చుట్టుకుని సరోజ గట్టెక్కినది.

ఇద్దరూ గోదావరివేపూ, తమ లాంచివేపూ చూశారు. అఖండగోదావరిలో వాళ్ళలాంచి ఎక్కడ మునిగినదీ వాళ్ళకి జాడకూడా తెలియలేదు.



జెమినీవారి హిందీ 'చంద్రలేఖ'లో అభినేత్రి రాజకుమారి